క్లుప్తంగా

అంధుల పాఠశాలకు సాయం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు కర్నూలు జిల్లా, పసుపుల అంధుల పాఠశాలకు శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామంలో సేకరించిన రూ.10 వేల నగదును అంధుల పాఠశాలకు అందించినట్లు చెప్పారు. పాఠశాల తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఉరుసు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో వెలసిన హజరత్ కావజా సయ్యద్‌షా చందాహుసేన్ సాహెబ్ ఉరుసును భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దర్గాను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మొదటి రోజు గంధం, రెండవ రోజు ఉరుసు, మూడవరోజు జియారత్‌తో ఉరుసు ముగిసింది. భక్తులు మూడు రోజుల పాటు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. శాంతి, దయ, క్షమాగుణం కలిగి జీవించాలని గురువులు బోధించారు.

రేపు కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదోని సెంట్రల్: కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 22న జూనియర్ బాల బాలికల రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.సుభకర్, జాయింట్ కార్యదర్శి అమర్ ప్రకాశ్ శుక్రవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఉదయం 9 గంటలకు స్టేడియంకు రావాలన్నారు. 12.01.2005 తర్వాత జన్మించిన వారు అర్హులని, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఉత్తమ ప్రతిభ చూపి ఎంపికైన వారికి జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో కేఈ ఫామ్ హౌస్ గ్రౌండ్‌లో 50వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని తెలిపారు. అలాగే నేషనల్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలు జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు హరిద్వార్‌లో జరుగుతాయని చెప్పారు. సెలక్షన్ కమిటీ సభ్యులు గోవిందు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి సాధించాలి



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి

ఎమ్మిగనూరురూరల్: పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం వల్ల యువత స్వయం ఉపాధి పొందవచ్చని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘవేంద్రచౌదరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకంపై రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ.. పది రోజు ల శిక్షణ వల్ల యువత స్వయం ఉపాధి పొందేందుకు మార్గం ఏర్పడుతుందని చెప్పారు. శిక్షణ పొందిన వారికి అందించే సర్టిఫికెట్ ద్వారా బ్యాంకు రుణం తీసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. శిక్షణలో చెప్పిన పద్ధతులను శ్రద్ధగా విని అవగాహన పెంచుకోవాలని సూచించారు. తేనెటీగల పెంపకంని ర్వాహకుడు కురువ ఈరన్న, బ్యాంకు సభ్యులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడమే లక్ష్యమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని గూడూరు బైపాస్‌లో ఆటోవర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించగా ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి బాలరాజు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నాడన్నారు. ఐఎఫ్‌టీయు జిల్లా సహాయ కార్యదర్శి చెన్నకేశవులు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

చేనేతల అభ్యున్నతికి కృషి



వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుకకు బొకే అందజేస్తున్న ఎంకే శివప్రసాద్

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయడంపై 6వ వార్డు కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ శుక్రవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం బుట్టా రేణుకను కలిసి తనకు బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. చేనేతల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

29, 30న సీపీఎం మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 29, 30 తేదీల్లో పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో సీపీఎం 23వ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో సీపీఎం జిల్లా మహాసభల బ్యానర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు రంగప్ప, అబ్దుల్లా, తిమ్మన్న, రమేష్, దావీదు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులతో ఆటలు



తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: మన పిల్లలకు ఇచ్చే ఆస్తి ఏదైనా ఉంది అంటే అది చదువు ఒక్కటే అని నమ్మిన వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. అందుకే ఆయన పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను చేపట్టారు. నాడు– నేడు పథకంతో బడుల రూపురేఖలను మార్చారు. ప్రభుత్వ బడులలో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం బోధనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేలా సీబీఎస్ఈ సెలబస్ ప్రవేశపెట్టి దశల వారీగా అన్ని పాఠశాలల్లో అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది. ఉన్నట్టుండి సీబీఎస్ఈ సెలబస్‌కు మంగళం పాడింది. విద్యాబోధన ఇంగ్లిష్‌లో కొనసాగుతుంటే తెలుగులో కూడా పరీక్షలను రాసుకోవచ్చని చెబుతోంది. ఇలా రోజుకో నిర్ణయంతో విద్యార్థులను అయోమయానికి గురిచేస్తోంది.

ఆదోని డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 247 పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, గురుకుల, కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాలలు ఆదోని డివిజన్‌లో 106, పత్తికొండ పరిధిలో 77 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆదోని డివిజన్‌లో 12,119 మంది, పత్తికొండ డివిజన్ పరిధిలో 6,516 మంది ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తరగతులను నిర్వహించి విద్యను అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వ పథకాలకు మంగళం పాడుతోంది. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటుంది. పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వరంగా మారిన సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమై మూడు నెలలు గడిచిన తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వాత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

పదో తరగతి ఎంతో కీలకం

విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. పదిలో సాధించిన మార్కులు భవిష్యత్తులో వారికి ఎంతగానో ఉపయోగపడతాయి. దీంతో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేస్తారు. గత ప్రభుత్వం విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలోని గురుకుల పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వంటి 90 పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేశారు. ఆదోనిలో 8 పాఠశాలల్లో అమలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ముదింపు పేరుతో పదో తరగతి విద్యార్థులకు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 50 ఇచ్చి ట్యాబ్‌లో పరీక్షలను నిర్వహించింది. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించినట్లు చెపుతున్నారు. ఆ పరీక్షలు ఏమిటి, ఫలితాలు ఏమిటి అన్నది ఏవరికి తెలియదు. ప్రభుత్వం మాత్రం విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్ అర్థం చేసుకోవడం లేదని రద్దు చేశారు. విద్యసంవత్సరం మూడు నెలలు గడిచిన తర్వాత రద్దు చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. తిరిగి రాష్ట్ర సిలబస్‌లో విద్యాబోధనను కొనసాగించారు. దీంతోనే తికమక పడుతున్న విద్యార్థులకు మరో షాక్ ఇచ్చారు. ఇంకో మూడు నెలల్లో పరీక్షలు రాసే విద్యార్థులు తెలుగులో కూడా రాసుకోవచ్చని ప్రకటన చేశారు. విద్యాబోధన ఇంగ్లిష్ మీడియంలో కొనసాగుతుంటే అర్థసంవత్సరం గడిచిన తర్వాత తెలుగులో కూడా పరీక్షలు రాసుకోవచ్చని ప్రకటన చేయడం దారుణం అని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఏ మీడియంలో పరీక్షలు రాయలో తెలియక విద్యార్థులు తికమక పడుతున్నారు.

విద్యార్థులు నష్టపోతారు



ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తు మీద అధారపడి ఉంటాయి. పాఠశాలలు పునఃప్రారంభం అయిన మూడు నెలలకు సీబీఎస్ఈ సిలబస్ తొలగించడం, ఆరు నెలలకు పదో తరగతి పరీక్షలను తెలుగులో కూడా రాసుకోవచ్చని ప్రకటన చేయడం మంచిది కాదు. ప్రభుత్వాలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకొని అమలు చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతారు. ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్నా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రకటన చేసి అమలు పరిస్తే బాగుంటుంది. విద్యార్థులను గందరగోళం పడేసి వారి జీవితాలతో ఆడుకోవడం మంచి పద్ధతి కాదు.

– శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం



విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. సీబీఎస్ఈ సిలబస్ కొనసాగిస్తున్న పాఠశాలల్లో రాష్ట్ర సిలబస్‌లో విద్యాబోధన అందిస్తున్నాం. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక తరగతులను కూడా నిర్వహించి విద్యను అందిస్తున్నాం. పదో తరగతి పరీక్షలను తెలుగులో కూడా రాసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటన చేసింది. విద్యాబోధన ఇంగ్లిష్‌లో కొనసాగించినప్పటికీ పాఠ్య పుస్తకాలు బైలాంగ్వేజ్‌లో పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులు తమకు అనుకూలమైన భాషలో పరీక్షలను రాసేందుకు అనుమతి ఇచ్చింది. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటరమణారెడ్డి ఉప విద్యాధికారి

సేవా కార్యక్రమాలకు పిలుపు



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆదోనిలో వైభవంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ వేడుకలకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు తరలిరావాలని సాంస్కృతిక విభాగం జిల్లాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు భారీఎత్తున కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, జీవనజ్యోతి అనాథాశ్రమంలో అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఎమ్మిగనూరుటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. మొదట దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులు, అనంతరం కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ, బుట్టాఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు కుర్చీల పంపిణీ, పార్టీ కార్యాలయం వద్ద దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు

ఆదోని అర్బన్: రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి ట్రాఫిక్ సమస్యను సృష్టించరాదని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. ఆదోని పట్టణంలోని షరాఫ్‌బజార్‌లో శుక్రవారం దుకాణాల వద్ద నిలిపి ఉంచిన బైక్‌లను తీయించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల ముందు వాహనాలను నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపి ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాల నియంత్రణకు చర్యలు



కోసిగి సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కోసిగి: జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కోసిగి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని పెద్దకడబూరు, కోసిగి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు తదితర వాటి పురోగతిపై ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎస్‌బీ సీఐ ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్‌ఐలు చంద్రమోహన్, నిరంజన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నందవరం: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ పుల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ జాబ్ కార్డులు మంజూరు చేశాయని, ఉపాధి కూలీలకు పనులు కల్పించాలన్నారు. 100 రోజుల పని దినాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యేలు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి

కౌతాళం: బళ్లారిలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వెంటరామిరెడ్డి కుమార్తె పెళ్లి బళ్లారిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో ఇద్దరు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ప్రదీప్ రెడ్డి, నాయకులు ప్రహ్లాదాచారి, బుజ్జిస్వామి, మహబూబ్‌సాబ్, దర్గాల ధర్మకర్తలు చిన్నమున్నపాషా, దూద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

పెద్దకడబూరు: రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థ ప్రభుత్వ వ్యవస్థలు, ప్రజల మధ్య వారధిగా పని చేస్తుందని ఆ సంస్థ కార్యకర్త కరుణప్ప పేర్కొన్నారు. మండల పరిధిలోని రాగిమాన్‌దొడ్డి గ్రామంలో ఆ సంస్థ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి పైప్‌లైన్ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ పనులను పంచాయతీరాజ్ ఏఈ సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యకర్తలు మాట్లాడుతూ..తమ సంస్థ ద్వారా నీటి సంరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులు, అనుబంధ రంగాలు, పౌష్టికాహారం, జీవనోపాధులు, డిజిటల్ లిటరసీపై అవగాహన కార్యక్రమాలతో పాటు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. అందులో భాగంగానే 400 మీటర్ల తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు వివరించారు. నీటి సమస్య తీరనుండటంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ సభ్యులు ఉసేని, గోవిందు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన అవసరం



వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న విద్యుత్ శాఖ డీఈ, ఏడీఈ

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్‌ను ఆదా చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయని, వాటిపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగిఉండాలని స్థానిక విద్యుత్ శాఖ డీఈ విజయరాజు పేర్కొన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పొదుపు తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం డీఈతో పాటు ఏడీఈ నాగేంద్రప్రసాద్ బహుమతులు అందజేశారు. ఏఈ ప్రసన్న ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కోసిగి: మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 132 కేవీ మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి



ఆదోనిలోని భీమాస్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ పట్టణ సమితి కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని భీమాస్ కూడలి వద్ద నిరసన తెలియజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ.. వెంటనే కేంద్రమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకుని, మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, బసాపురం గోపాల్, విజయ్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరులో శుక్రవారం పట్టణంలో పలు ప్రజా, దళిత సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడారన్నారు. ఆయన మంత్రి పదవికి రాజీనామా చేసి అంబేడ్కర్ విగ్రహ పాదాలు పట్టుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకోవాలన్నారు. ఆయా సంఘాల నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, రంగన్న, హనీఫ్, నర్సప్ప, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకపోతే కుళాయి కనెక్షన్ కట్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఇంటి, నీటి పన్నులను సకాలంలో చెల్లించకపోతే కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ హెచ్చరించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో ఏటా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి, నీటి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇప్పటివరకు మున్సిపాలిటీలో ఆస్తి పన్ను రూ.15 కోట్లకుగానూ రూ.7 కోట్లు, నీటిపన్ను రూ.7 కోట్లకు గానూ రూ.2 కోట్లపైచిలుకు వసూలైందని చెప్పారు. ప్రజలు వీలైనంత త్వరగా పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు హనుమాన్‌నగర్, ఎరుకుల కాలనీ, కార్వన్‌పేట, ఎస్‌కేడీ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ తదితర కాలనీల్లో పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వారికి సంబంధించి 20 కుళాయి కనెక్షన్లను కట్ చేశామన్నారు. పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, అందులో కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్, ఆర్ఐలు, సచివాలయ ఉద్యోగులు, వాటర్ వర్క్స్ లైన్‌మెన్లు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారని తెలిపారు.

స్కూల్ యాజమాన్యం దోపిడీపై ఫిర్యాదు



డీఈఓ కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కోసిగి: స్కూల్ ఫీజులు, బస్సు ఫీజులు, వార్షికోత్సవం కోసం అదనంగా వసూళ్లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న మౌంట్ కార్మెల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈమేరకు శుక్రవారం కోసిగికి వచ్చిన జిల్లావిద్యాధికారి శామ్యూల్‌పాల్‌ను కలిసివినతిపత్రం అందించారు.

జిల్లాలో 34 సీజనల్ హాస్టళ్లు

జిల్లాలో వలస వెళ్లే కుటుంబాల్లోని పిల్లల కోసం 34 సీజనల్ హాస్టల్ ప్రారంభించినట్లు జిల్లా విద్యాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ శామ్యూల్ పాల్ సూచించారు. మండలంలోని కోసిగి బాలికల ఉన్నత పాఠశాల, చాకలిగేరి ప్రాథమిక పాఠశాల ఐరన్‌గల్లు, కందుకూరు గ్రామాల్లో సీజనల్ హాస్టళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం మండలంలో అభివృద్ధి పనులపై పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈఓపీఆర్డీ అధికారులతో చర్చించారు. ఆయన వెంట సీఆర్‌పీలు ఉన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి, తహసీల్దార్

ఎమ్మిగనూరుటౌన్: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించినట్లు జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి నజిమా కౌసర్, తహసీల్దార్ శేషఫణి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీని వారు ప్రారంభించారు. కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. వినియోగదారుడు వస్తుసేవల అమ్మకం, కొనుగోలులో మోసపోయినా, వస్తువు నాణ్యత లోపించినా తమ ఫోరంను ఆశ్రయించవచ్చని సూచించారు. అలాంటి వారికి 90 రోజుల్లో ఫోరం రక్షణ కల్పిస్తుందన్నారు. ఫోరం సభ్యులు నదీంహుసేన్, శివారెడ్డి, రహమతుల్లా, ఖిబులాహుసేన్, దిల్‌షాద్ అలీ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


దళితులపై వివక్షను రూపుమాపాలి

ఆదోని రూరల్: మండలంలోని జి.హొసళ్లి గ్రామంలో కొనసాగుతున్న వివక్షను రూపుమాపాలని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఎస్పీ సోమన్న, సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి, తాలూకా సీఐ నల్లప్పకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా తిక్కప్ప మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటికీ దళితులకు ఆలయ ప్రవేశం లేదని వాపోయారు. గ్రామంలో జరిగే ఊరు దేవర సందర్భంగా పూజ నిర్వహణ క్రమంలో చూపుతున్న వివక్షను భరించలేకపోతున్నారన్నారు. వాటిలో జోక్యం చేసుకుని వివక్ష నిర్మూలనకు కృషి చేయాలని అధికారులను కోరారు. కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, డీవైఎఫ్ఐ నాయకులు వెంకటేష్, కేవీపీఎస్ గ్రామాధ్యక్ష కార్యదర్శులు సురేష్, రమేష్, కమిటీ సభ్యులు రాఘవయ్య, వీరేష్, మల్లికార్జున, చిన్నరాఘవయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ ఉండలేను నాన్నా..

- చిరుప్రాయంలో భవన నిర్మాణ కార్మికుడిగా మారిన బాలుడు
- బరువైన పనులు చేయలేక విరక్తి చెంది ఆత్మహత్య

కటిక పేదరికంతో కష్టాలు పడుతున్న ఓ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. పిల్లాడికి ఒక్క పూట తిండి పెట్టలేని స్థితిలో పనికి పంపిన తల్లిదండ్రులకు చివరకు గర్భశోకమే మిగిలింది. బరువైన పనులు చేయలేక సతమతమైన చిన్నారి పట్టుమని 14 ఏళ్లు కూడా నిండకనే ఉరికి విగతజీవిగా వేలాడాడు. ఈ విషాదకర ఘటన అనంతపురం కలెక్టరేట్‌కు ఓ కిలోమీటరు దూరంలో చోటుచేసుకోవడం గమనార్హం.



ఆత్మహత్య చేసుకున్న శివ

అనంతపురం: భవన నిర్మాణ రంగంలో బరువైన పనులు చేయలేక ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామానికి చెందిన కురబ అయ్యన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కటిక పేదరికం కారణంగా పిల్లలను పోషించుకోలేక ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో చిరుప్రాయంలోనే పిల్లలు కార్మికులుగా మారారు. ఆరో తరగతితోనే చిన్న కుమారుడు శివ (14) చదువులకు స్వస్తి పలికి అన్న నాగేంద్రతో పాటు సెంట్రింగ్ పనికి వెళుతున్నాడు.

బతుకుదెరువుకు వలస వచ్చి..

బతుకుదెరువు కోసం నాగేంద్ర, శివ, రమేష్, సురేష్, వలి ఆరు నెలల క్రితం అనంతపురానికి వలస వచ్చి భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హౌసింగ్ బోర్డు హమాలీ కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వేకువజామున పనికి వెళ్లి సాయంత్రం ఆరు గంటల తర్వాత గదికి చేరుకునేవారు. పని ప్రాంతంలో బరువైన పనులు చేయలేక శివ ఇబ్బంది పడ్డాడు. విషయాన్ని పలు మార్లు తల్లిదండ్రులకు చెప్పాడు. ఊరికి వచ్చి వ్యవసాయ కూలి పనులకు వెళతానంటూ ప్రాధేయపడినా తల్లిదండ్రులు వినలేదు. దీంతో మనస్తాపం చెందిన శివ శుక్రవారం మధ్యాహ్నం గదికి వెళతానని అన్న నాగేంద్రకు చెప్పి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాలుడి తండ్రి అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న శానిటరీ సిబ్బంది

ఆదోని టౌన్: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాల్లో శుక్రవారం సాయంత్రం శానిటరీ సిబ్బంది తనిఖీ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. తనిఖీల్లో 42 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.4500 జరిమానా విధించినట్లు చెప్పారు. ప్రతి దుకాణదారుడు ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సెక్రటరీలు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.